సంపుటి :02 సంచిక :294 పేజీలు :07 వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

గురువారం 29, జనవరి 2026

## రూ.2,500 కోట్లతో టెంపుల్ సర్క్యూట్

ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా మేడారం అభివృద్ధి



- శాశ్వత అభివృద్ధికి 70 ఎకరాల భూసేకరణ
- ఇప్పటికే 29 ఎకరాల సేకరణ పూర్తి
- మిగిలిన 41 ఎకరాల ప్రక్రియ పూర్తి చేస్తాం
- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి మంత్రి పొంగులేటి

05



# మేడారం జయహో..

## గద్దెపైకి సమ్మక్క తల్లి!

- వనం వీడి జనంలోకి వనదేవత..
- చిలుకలగుట్ట వద్ద మంత్రుల ఘన స్వాగతం
- గాల్లోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించిన ఎస్పీ
- జయజయధ్వానాలతో మార్మోగిన అడవి..
- నిన్న సారలమ్మ, నేడు సమ్మక్క రాక
- జనసంద్రంగా మేడారం.. ఎత్తు బంగారం
- సమర్పించుకుంటున్న భక్తులు

వనం నుంచి జనప్రవాహం దిశగా.. అడవి తల్లి అడుగులు వేసింది! నిశ్శబ్దారణ్యంలో నిద్రాణమై ఉన్న విప్లవ శక్తి, భక్తుల కోలాహలం మధ్య భరిణె రూపంలో గద్దెపైకి ఉరికివచ్చింది. గగనతలాన్ని తాకే జయజయధ్వానాలు ఒకవైపు.. గాల్లోకి పేలిన పోలీసు తుపాకుల గౌరవ వందనం మరొకవైపు.. వెరసి మేడారం మహాజాతర పరాకాష్టకు చేరింది. కుంకుమ వర్ణమై కురిసిన సమ్మక్క తల్లి రాకతో మంచు కొండల వంటి కష్టాలు కరిగిపోతాయన్న భక్తకోటి విశ్వాసం నేడు గద్దెల సాక్షిగా సాక్షాత్కరించింది. కన్నీటి కష్టాలను తుడిచేందుకు, కన్నతల్లిలా దీవించేందుకు సారలమ్మ చెంతకు సమ్మక్కమ్మ చేరిన ఈ అద్భుత ఘట్టం.. యావత్ ఆసియాలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక విప్లవానికి ప్రతీకగా నిలిచింది!

02

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన మహాకుంభమేళా మేడారంలో పారవశ్యం వెల్లివిరిసింది. జాతరలో అత్యంత కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవం, అన్యాయంపై ఎదిరించిన వీరమాత సమ్మక్క తల్లి వనం వీడి జనంలోకి వచ్చింది. గురువారం సాయంత్రం కుంకుమ భరిణె రూపంలో ఉన్న అమ్మవారిని ప్రధాన పూజారి చిలుకలగుట్టపై నుంచి తీసుకురావడంతో మేడారం జనసంద్రమైంది. భక్తుల జయజయధ్వానాలు, శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లతో అడవి మొత్తం హోరెత్తింది. - అక్షర దర్బార్, మేడారం

## ఛత్తీస్‌గఢ్‌లో ఎదురు కాల్పులు

- ఇద్దరు మావోయిస్టులు మృతి
- బీజాపూర్ జిల్లాలో ఘటన



## చరిత్రలో నిలిచిపోయే రోజు

- బేగంపేట సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కేంద్రమంత్రికి మామునూరు ఎయిర్పోర్టు కోసం భూమి అప్పగింత

06



## రేపు చివరి రోజు

- రెండో రోజు భారీగా దాఖలైన నామినేషన్లు




## ఆ మున్సిపాలిటీలపై గురి

- మున్సిపల్ ఎన్నికలపై గులాబీ దళం ఫోకస్
- స్టేషన్ ఘన్‌పూర్ బల్దియాపై ప్రత్యేక నజర్
- ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యే కడియంపై రివేంజ్‌కు వ్యూహరచనలు
- రంగంలోకి ఎమ్మెల్సీ పోచంపల్లి.. గులాబీ శ్రేణులకు దిశానిర్దేశం
- తొర్రూర్, వర్ధన్నపేటలో అధికార పార్టీలో ముసలం
- బీఆర్ఎస్ కు కలిసి రానున్న వర్గపోరు
- పేట`లో `ఆరూరి చేరికతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం
- జనగామలో పల్లా, మరిపెడలో రెడ్యా గెలుపుపై ధీమా
- ఇతర బల్దియాల్లోనూ అధికార పార్టీకి టగ్ ఆఫ్ వారే!

06

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల వేడి మొదలైంది. అసెంబ్లీ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవడమే లక్ష్యంగా 'గులాబీ దళం' వ్యూహాలకు పదును పెడుతోంది. ముఖ్యంగా కడియం శ్రీహరి లాంటి నేతలపై రివేంజ్ తీర్చుకునేందుకు స్టేషన్ ఘన్‌పూర్ పీఠంపై బీఆర్ఎస్ నజర్ పెట్టింది. కాంగ్రెస్‌లోని అంతర్గత వర్గపోరును సానుకూలంగా మార్చుకుని, 12 మున్సిపాలిటీల్లో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాలని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో కత్తులు నూరుతున్నారు.

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి






# గద్దెపైకి సమ్మక్క

- వనం వీడి జనంలోకి వనదేవత
- చిలుకలగుట్ట వద్ద స్వాగతం పలికిన మంత్రులు సీతక్క, లక్ష్మణ్, అధికారులు
- గౌరవ సూచకంగా గాల్లోకి ఎస్పీ కాల్పులు
- సమ్మక్క తల్లికి గౌరవ వందనం సమర్పించిన పోలీసులు
- సమ్మక్కకు జై అంటూ భక్తుల నినాదాలు
- వెల్లివిరిసిన భక్తి పారవశ్యం
- జయజయద్వానాలతో గద్దెపైకి చేరిన సమ్మక్క
- ఇప్పటికే గద్దలపై కొలువుదీరిన సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు
- జనసంద్రమైన మేడారం పరిసరాలు
- భక్తులతో కిక్కిరిసిన అమ్మవార్ల గద్దెల ప్రాంగణం
- ఎత్తు బెల్లం సమర్పిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు
- వనదేవతలను దర్శించుకున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు



అక్షరదర్బార్, మేడారం : మేడారం మహాజాతరలో అత్యంత కీలకమైన ఘట్టం ఆవిష్కృతమైంది. సమక్క తల్లి వనం వీడి జనంలోకి వచ్చింది. చిలుకలగుట్ట నుంచి వనదేవత సమ్మక్క తల్లి జనారాణ్యంలోకి అడుగుపెట్టింది. భక్తజన కోటి జయజయధ్వానాలు, డప్పు చప్పుళ్ల నడుమ అడవి తల్లి జనంలోకి వచ్చింది.. కుంకుమ భరిణె రూపంలో ఉన్న అమ్మవారిని ప్రధాన పూజారి చిలుకలగుట్టపై నుంచి తీసుకొచ్చారు. ఈ క్రమంలో చిలుకలగుట్ట వద్ద రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ తదితరులు సమ్మక్క తల్లికి ఘన స్వాగతం పలికారు. గౌరవ సూచకంగా జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ గాల్లోకి కాల్పులు జరిపారు. సమ్మక్క తల్లికి పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అమ్మవారు గద్దె వైపు సాగుతున్న వేళ మేడారం పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో నిండిపోయాయి. లక్షలాది మంది భక్తులు తమ ఆరాధ్య దైవాన్ని కళ్లారా చూసి తరించారు. సమ్మక్క తల్లి ఆగమనం వేళ పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. గిరిజన పూజారులు కుంకుమ భరిణెను పట్టుకుని కదులుతుండగా భక్తులు భక్తి పారవశ్యంతో ఊగిపోయారు. శివసత్తుల పూనకాలు, కోయ దొరల నృత్యాలతో అడవి మొత్తం హోరెత్తింది. భక్తుల రద్దీని నియంత్రించడానికి ప్రత్యేక బలగాలు రోప్ సాయంతో కష్టపడాల్సి వచ్చింది.

## - వనం గద్దెపై ప్రతిష్టించి..

ఆసియాలో అతి పెద్ద జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో నిన్న రాత్రి సారలమ్మ గద్దెకు చేరగా నేడు సమ్మక్క తల్లి చిలుకల గుట్ట నుండి గద్దెల వద్దకు చేరుకుంది. అయితే సమ్మక్క రాక సందర్భంగా ముందుగా వనం (వెదురు కరళ్లను) గద్దెపై ప్రతిష్టించారు. జాతరలో వనం (వెదురు)కు విశిష్ఠత ఉంది. వనం అంటే ఆదివాసీ భాషలో అడవి అని అర్థం. ఈ వనం నుంచి తల్లులు గద్దెల పైకి వస్తారు. ఈ నేపథ్యంలో ముందుగా ఏపుగా ఎరిగిన వెదురు కర్రలను ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి సమ్మక్క గద్దె వదకు తీసుకు వచ్చి గద్దెపై ప్రతిష్టిస్తారు. వనం (వెదురు) తీసుకు వచ్చిన తరువాత చిలుకలగుట్ట నుండి సమ్మక్కను తీసుకొచ్చారు.

## - తరలివస్తున్న భక్తులు

సారలమ్మ ఇప్పటికే గద్దెపై కొలువుదీరి ఉంది. అలాగే పగిడిద్దరాజు, గోవిందారాజు కూడా కొలువుదీరారు. ఇప్పుడు సమ్మక్క తల్లి కూడా తోడవడంతో జాతరలో ప్రధాన ఘట్టం పూర్తయింది. ఈ అపురూప దృశ్యాన్ని చూడటానికి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల నుండి భక్తులు పోటెత్తారు. గద్దెలపై కొలువుదీరిన తల్లులకు భక్తులు ఎత్తు బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి తల్లుల దర్శనం కోసం గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు తాగునీరు, ఇతర సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నారు. గురువారం కేంద్ర మంత్రులు జువల్ ఓరం, జి కిషన్ రెడ్డి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దంపతులు, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు తదితరులు వనదేవతలను దర్శించుకున్నారు. శుక్రవారం సమ్మక్క– సారలమ్మలు ఇద్దరూ గద్దెలపై ఉండి భక్తులకు దర్శనమిస్తారు. భక్తులతో మేడారం ప్రాంగణం కిక్కిరిసిపోయింది. గిరిజన సంస్కృతికి అద్దం పట్టే ఈ వేడుకను చూడటానికి విదేశాల నుండి కూడా పర్యాటకులు తరలివస్తున్నారు. తల్లులు తిరిగి వనప్రవేశం చేసే వరకు ఈ భక్తి ప్రవాహం కొనసాగుతూనే ఉంటుంది. శనివారం సాయంత్రం వనదేవతలు మళ్లీ అడవిలోకి వెళ్లే ప్రవేశంతో ఈ మహాజాతర ముగుస్తుంది.



### దేశం సుభిక్షంగా ఉండాలని

# వనదేవతలకు మొక్కుకున్న

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- ఇతర కేంద్ర మంత్రులతో కలిసి అమ్మవార్ల దర్శనం
- వారికి ఘన స్వాగతం పలికిన రాష్ట్ర మంత్రులు పొంగులేటి, సీతక్క

అక్షరదర్బార్, మేడారం : దేశం సుభిక్షంగా ఉండాలని వనదేవతలు సమ్మక్క– సారక్కను మొక్కుకున్నానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన కేంద్ర మంత్రి జుయల్ ఓరమ్ తో కలిసి వన దేవతలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవార్లకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర గిరిజన సంస్కృతికి ప్రతీక అని, కోట్లాది మంది భక్తుల నమ్మకానికి నిదర్శనమని ఆయన కొనియాడారు. గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుతో పాటు పర్యాటక రంగం అభివృద్ధికి ఇప్పటికే నిధులు కేటాయించినట్లు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కోరిన విధంగా జాతీయ హోదా అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కేంద్ర మంత్రులకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ స్వాగతం పలికారు. మేడారం జాతరను 'జాతీయ పండుగ'గా గుర్తించాలని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జుయల్ ఓరమ్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులువినతిపత్రం అందజేశారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ అయిన మేడారానికి జాతీయ హోదా కల్పించడం వల్ల ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. మేడారం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర మంత్రులు హామీ ఇచ్చారు.





# కులాల ప్రభావం

- పార్టీలకన్నా కులాలకే ప్రాధాన్యం!
- పరకాల మున్సిపాలిటీలో కుల రాజకీయాల హవా

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ ఎన్నికల్లో ఈసారి రాజకీయ పార్టీల కంటే కులాల ప్రాధాన్యతే ఎక్కువగా కనిపిస్తోంది. పార్టీల గుర్తుల కంటే తమ కులానికి చెందిన అభ్యర్థికే ఓటు వేయాలనే ధోరణి ఓటర్లలో బలంగా వ్యక్తమవుతోంది. దీంతో పరకాల మున్సిపల్ ఎన్నికలు పార్టీలకు తలనొప్పిగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

### అభ్యర్థుల ఎంపికలో కుల లెక్కలు

పరకాల మున్సిపాలిటీలో మొత్తం 22 వార్డులు ఉండగా, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రధానంగా బరిలో ఉన్నాయి. అయితే, ఏ వార్డులో ఏ కులానికి చెందిన ఓట్లు ఎక్కువగా ఉన్నాయన్న అంశాన్నే ప్రాతిపదికగా చేసుకుని అభ్యర్థులు పోటీలో దిగుతున్న పరిస్థితి నెలకొంది. ఆయా ప్రధాన రాజకీయ పార్టీ నాయకత్వం సైతం ఆయా వార్డులో ఆధిపత్యం ఉన్న కులం అభ్యర్థికే తమ పార్టీ టికెట్ ఇవ్వడానికి మొగ్గు చూపుతుండటం గమనార్హం.

### కుల పెద్దలతో భేటీలు –తీర్మానాలు

అభ్యర్థులు తమ కుల సంఘం పెద్దలతో సమావేశాలు నిర్వహిస్తూ, 'పార్టీలకు అతీతంగా తమ కుల పోనికే ఓటు వేయాలి' అంటూ తీర్మానాలు చేయిస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే కుల సంఘ నాయకులతో సమావేశాలు, దావతులు నిర్వహిస్తున్న ఘటనలు పరకాల పట్టణంలో కనిపిస్తున్నాయి.

### ఇతర కుల అభ్యర్థులకు పోటీ భయం

ఆయా వార్డులో ఒక్కో కుల సంఘానికి 200 నుంచి 300 వరకు ఓట్లు ఉండటంతో, తమ కులానికి చెందిన అభ్యర్థికే ఓటు వేస్తామంటూ వారు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. దీంతో ఇతర కులాలకు చెందిన వారు పోటీలో నిలబడేందుకు జంకుతున్న పరిస్థితి కనపడుతుంది.

### ఓటర్ల సంఖ్య ఇలా..

- పరకాల మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 26,653 మంది ఓటర్లు ఉన్నారు.
- వీరిలో మహిళలు 13,433,
- పురుషులు 13,216
- ట్రాన్స్ జెండర్లు 4గురు.

కులాల వారీగా ఓటర్లలో

- ఎస్సీలు 7,542 మంది ఉంటే వీరిలో పురుషులు 3,681, మహిళలు 3,860,
- ట్రాన్స్ జెండర్ ఒకరు. ఎస్టీలు 338 మంది ఉండగా పురుషులు 159,
- మహిళలు 179, బీసీలు 16,592 ఉంటే పురుషులు 8,281, మహిళలు 8,308,
- ట్రాన్స్ జెండర్లు 3, ఓసీలు 2,181 మంది ఉండగా పురుషులు 1,095,
- మహిళలు 1,086 మంది ఉన్నారు.

### - పార్టీలకు అతీతంగా ఫలితాలు?

ఈ ధోరణి కొనసాగితే, పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో పార్టీలకతీతంగా కుల సంఘ ఓట్లతోనే విజయం సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఎన్నికలు రాజకీయ పార్టీలకు కాకుండా, కుల రాజకీయాలకు వేదికగా మారనున్నాయన్న చర్చ జోరుగా సాగుతోంది.



# కాంగ్రెస్ కు షాక్

### పరకాలపై మాజీ ఎమ్మెల్యే చల్లా ప్రత్యేక దృష్టి

### బీఆర్ఎస్ లో చేరిన మాజీ కౌన్సిలర్ బండారి కవిత కృష్ణ

అక్షర దర్బార్, పరకాల: పరకాల నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించిన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆర్ఎస్‌లో చేరికలకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. గత వారం రోజులుగా పరకాలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు వరుసగా బిఆర్ఎస్ పార్టీలో చేరుతుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### కాంగ్రెస్ కు గుడ్ బై

ఈ క్రమంలో పరకాల మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ బండారి కవిత కృష్ణ కాంగ్రెస్ పార్టీని వీడి బుధవారం భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్)లో చేరారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో ఆమె బిఆర్ఎస్ పార్టీలో చేరగా, పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో 9వ వార్డు నుంచి బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా బండారి కవిత కృష్ణను ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఆమె చేరికతో పరకాల మున్సిపాలిటీలో బిఆర్ఎస్ మరింత బలోపేతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ ఎస్ హయాంలోనే మైనారిటీల సంక్షేమం

### మాజీ కో–ఆప్షన్ సభ్యురాలు ఫాతిమా హమీద్

అక్షరదర్బార్, పరకాల : తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనారిటీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు మాజీ కో–ఆప్షన్ సభ్యురాలు ఫాతిమా హమీద్ అన్నారు. పరకాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో మైనారిటీల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు పేర్కొన్నారు. షాదీ ముబారక్, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు, విదేశీ విద్యానిధి, యువతకు సబ్సిడీ రుణాలు, మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ, రంజాన్ సందర్భంగా దుస్తుల పంపిణీ, ఇఫ్తార్ విందులు, ఇమామ్–మౌజన్‌లకు గౌరవ వేతనం, వక్ఫ్ ఆస్తుల రక్షణకు ప్రత్యేక గ్రాంట్ వంటి పథకాలు ముస్లిం మైనారిటీలకు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. యాభై ఏళ్లలో ఎవరూ చేయని విధంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముస్లింలకు డిప్యూటీ సీఎం పదవితో పాటు హోంశాఖ బాధ్యతలు అప్పగించారని, ఇది మైనారిటీలకు దక్కిన గౌరవంగా ఆమె అభివర్ణించారు. మైనారిటీల సంక్షేమానికి సుమారు రూ.12 వేల కోట్ల నిధులు ఖర్చు చేసి విద్య, ఉపాధి రంగాల్లో పేద కుటుంబాలకు భరోసా కల్పించారని పేర్కొన్నారు.





## వనదేవతలను దర్శించుకున్న

# డిప్యూటీ సీఎం భట్టి

### పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ దంపతులకు ఘన స్వాగతం

అక్షర దర్బార్, మేడారం : మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతర సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దంపతులు, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దంపతులు గురువారం వనదేవతలను దర్శించుకున్నారు. ఆదివాసీ సంప్రదాయ కళాకారుల నృత్య ప్రదర్శనలతో రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమ్మక్క, సారలమ్మ తల్లులకు నిలువెత్తు బంగారంతో మొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లను దర్శించుకుని రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రార్థించినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.. వనదేవతలు తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాల సుఖ సంతోషాలతో ఉంచాలని వేడుకున్నామని చెప్పారు. మేడారం జాతర సందర్భంగా చరిత్రాత్మక కట్టడాలు దేశ ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయని, గతంతో పోలిస్తే ఈసారి జాతరకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారని పేర్కొన్నారు.

### హుస్సేన్ నాయక్ మొక్కులు

అక్షర దర్బార్, మేడారం : జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు జాతోత్ హుస్సేన్ నాయక్, నిరుపమ సుక్మా, తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డీజీపీ విక్రమ్ సింగ్ మాన్ తదితరులు మేడారం సమ్మక్క–సారలమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు మొక్కులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఘనంగా స్వాగతం పలికారు. జాతర నిర్వహణ ఏర్పాట్లు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులతో వారు వివరాలు తెలుసుకున్నారు.

# మున్సిపల్ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

### –కలెక్టర్ రాహుల్ శర్మ

అక్షర దర్బార్, భూపాలపల్లి : మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఐడీఓసి కార్యాలయంలో సాధారణ పరిశీలకులు ఫణీంద్ర రెడ్డితో కలిసి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్, పోలింగ్ మెటీరియల్ పంపిణీ ప్రక్రియలను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై 24, 48, 72 గంటల నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులకు 9030632608 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, వ్యయ పరిశీలకులు ఎన్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.


# ఎన్నికల సాధారణ పరిశీలకులుగా ఫణీంద్ర రెడ్డి



అక్షర దర్బార్, భూపాలపల్లి ప్రతినిధి : మున్సిపల్ ఎన్నికలకు సాధారణ పరిశీలకులుగా నియమితులైన ఫణీంద్ర రెడ్డి శుక్రవారం నుండి జెన్కో లోని గోదావరి విశ్రాంతి భవనంలో ప్రతి రోజు సా యంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎవరికైనా ఫిర్యాదులు లేదా అభ్యంతరాలు ఉన్నట్లయితే, సంబంధిత వ్యక్తులు నేరుగా కానీ లేదా 99499 92992 ఫోన్ ద్వారా కాని ఫిర్యాదులను తెలియ చేయాలని ఆయన సూచించారు. మున్సి పల్ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# మేడారం జాతరపై కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం

## జాతరకు సెలవు ప్రకటించకపోవడంపై విడ్డూరం



అక్షర దర్బార్, నర్సంపేట : తెలంగాణ ఆదివాసుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ప్రపంచ ప్రఖ్యాత మేడారం సమ్మక్క–సారక్క మహా జాతరపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ చూపుతున్నాయని భక్తులు, ఆదివాసి సంఘాలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాయి. కోటి మందికి పైగా భక్తులు దర్శించుకునే ఈ మహా జాతరకు ఇప్పటివరకు ఒక రోజు సంపూర్ణ సెలవు కూడా ప్రకటించకపోవడం ప్రభుత్వాల వైఖరిని స్పష్టం చేస్తోందని వారు విమర్శిస్తున్నారు. ఆదివాసి సాంప్రదాయం, సంస్కృతి, విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే మేడారం జాతరను ప్రభుత్వాలు కూడా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నప్పటికీ, రాష్ట్ర పండుగగా గుర్తించకపోవడం బాధాకరమని పలువురు పేర్కొన్నారు. అవసరమైతే సెలవు ప్రకటించినా, మరో రోజును వర్కింగ్ డేగా ప్రకటించడం అన్యాయమని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే సమ్మక్క–సారక్క తల్లులు గద్దెలపైకి చేరుకునే పవిత్ర సమయం ఆసన్నమైన నేపథ్యంలో, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మేడారం సమ్మక్క–సారక్క మహా జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించి, సంపూర్ణ సెలవు ప్రకటించాలని భక్తులు, ఆదివాసి సంఘాలు కోరుతున్నాయి.

# టీఎస్ ఎంహెచ్ పీఎస్ జిల్లా కన్వీనర్ గా మొహిబుద్దీన్



అక్షర దర్బార్, హనుమకొండ : తెలంగాణ స్టేట్ మైనారిటీ హక్కుల పోరాట సమితి (టీఎస్ ఎంహెచ్‌పీఎస్) హనుమకొండ జిల్లా కన్వీనర్‌గా మొహమ్మద్ మొహిబుద్దీన్‌ను నియమించారు. ఈ సందర్భంగా టీఎస్ ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జనాబ్ అబ్దుల్ వాహబ్ మొహిబుద్దీన్‌కు అధికారిక నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మొహిబుద్దీన్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మైనారిటీల హక్కుల సాధన, సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఆయన నియామకంపై జిల్లా మైనారిటీ నాయకు లు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపా రు. టీఎస్ ఎంహెచ్‌పీఎస్‌ను జిల్లా స్థాయిలో మరింత బలోపే తం చేయడంలో మొహిబుద్దీన్ కీలక పాత్ర పోషిస్తారన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

# సర్పంచ్ కు సన్మానం

అక్షర దర్బార్, దుగ్గొండి : దుగ్గొండి మండలం మైసంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ వేముల ఇంద్రదేవ్‌ను నర్సంపేట డివిజన్ యూత్ కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపల్లి సందీప్, కోనాపురం సర్పంచ్ మైదం రాకేష్, వార్డు సభ్యులు నరిగె ప్రవీణ్, కోరే రాజేష్, కొర్ర రాహుల్, భూక్యా గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# నామినేషన్ కేంద్రంలో తనిఖీ

అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాట్లు, భద్రతా చర్యలు, స్వీకరణ విధానాన్ని ఆయన పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని తెలిపారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, జనవరి 30 చివరి తేదీ కావడంతో రద్దీకి అదనపు సిబ్బందిని నియమించాలని సూచించారు. భద్రత పటిష్టంగా నిర్వహించాలని, నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , రిటర్నింగ్ అధికారులు, మున్సిపల్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డుపై గుంతలు పూడ్చివేత



అక్షరదర్బార్, పరకాల: దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని కంఠాత్మకూర్ మాటు వాగు వద్ద రోడ్డు గుంతలు ఎక్కువగా ఉండటంతో శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు రాకపోకల్లో ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన దామెర ఎస్ఐ కొంక అశోక్ గురువారం టిప్పర్ల ద్వారా మొరం పోయించి రోడ్డు గుంతలను పూడ్చి చదును చేయించారు. భక్తుల సురక్షిత ప్రయాణం కోసం ముందస్తు చర్యగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. స్థానికులు ఎస్ఐని అభినందించారు.





# మేడారం జనసంద్రం

- జనసంద్రాన్ని తలపిస్తున్న వనదేవతల ప్రాంగణం
- ఎత్తు బంగారం సమర్పిస్తూ మొక్కుల సమర్పణ
- నేటి సాయంత్రం గద్దెపైకి రానున్న సమ్మక్క
- పుష్కారాలను తలపిస్తున్న జంపన్న వాగు

అక్షర దర్బార్, మేడారం : ములుగు జిల్లాలోని మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతర భక్తజన సముద్రంగా మారింది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో వనదేవతల ప్రాంగణం జనసంద్రాన్ని తలపిస్తోంది. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచే కాకుండా దేశ నలుమూలల నుంచి ఆదివాసీ గిరిజనులు, భక్తులు మేడారానికి పోటెత్తారు. దీంతో మేడారానికి వచ్చే అన్ని మార్గాలు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. భక్తులు వెంట తెచ్చుకున్న కోళ్లను వనదేవతల గద్దెల సమీపంలో గాల్లోకి ఎగురవేస్తూ మొక్కులు చెల్లిస్తున్నారు. "కుటుంబాలను చల్లగా దీవించు తల్లీ" అంటూ దేవతలను కొలుస్తూ ఎత్తు బంగారాలను సమర్పిస్తున్నారు. వచ్చే రెండు రోజులు మరింత భారీ సంఖ్యలో భక్తులు మేడారానికి తరలిరానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మేడారం వెళ్లే దారి పొడవునా గిరిజన మహిళల నృత్యాలు, దొరల కొమ్ము బూరల మ్రోగుడు భక్తులకు సంప్రదాయబద్ధ స్వాగతం పలుకుతున్నాయి. ఇక్కడి వాతావరణం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తుతోంది. ఈ అరుదైన గిరిజన సంస్కృతిని అధ్యయనం చేయడానికి విదేశాల నుంచి కూడా మానవ శాస్త్ర పరిశోధకులు మేడారానికి చేరుకుంటున్నారు. ఇప్పటికే సారలమ్మ అమ్మవారు పగిడిద్ద రాజు, గోవిందరాజులు గద్దెలపైకి చేరుకున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని గత నెల రోజుల నుంచే భక్తులు మేడారానికి తరలివస్తుండడం విశేషం. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం రూ.251 కోట్ల వ్యయంతో శాశ్వత అభివృద్ధి పనులను పూర్తి చేసింది. అడవి తల్లుల ఆశీస్సుల కోసం లక్షలాది మంది భక్తుల రాకతో మేడారం అడవి పులకించిపోతోంది. ఆధునిక కాలంలోనూ ఆదివాసీ సంప్రదాయాల శక్తిని చాటిచెప్పే ఈ జాతర కేవలం ఒక పండుగ మాత్రమే కాదు... కోట్లాది మంది నమ్మకానికి ప్రతీక. మేడారంలో ఎక్కడ చూసినా బెల్లం (బంగారం) కుప్పలే దర్శనమిస్తున్నాయి. భక్తులు తమ కోరికలు నెరవేరినందుకు కృతజ్ఞతగా తల్లులకు బంగారాన్ని సమర్పిస్తున్నారు.

### పుష్కరశోభను తలపిస్తున్న జంపన్న వాగు

కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న జంపన్న వాగు భక్తుల స్నానాలతో జనసముద్రాన్ని తలపిస్తోంది. వాగులో స్నానం చేస్తే పాపాలు తొలగిపోతాయనే ప్రగాఢ విశ్వాసంతో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. ఈ దృశ్యం పుష్కరాలను గుర్తుకు తెస్తోంది.

పటిష్ట భద్రత, ఆధునిక సౌకర్యాలు

గద్దెల వద్ద తొక్కిసలాట జరగకుండా అత్యాధునిక సెన్సార్ల ద్వారా రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. 50కి పైగా మొబైల్ మెడికల్ యూనిట్లు, ఎమర్జెన్సీ కోసం ఎయిర్ అంబులెన్స్ సౌకర్యం సిద్ధంగా ఉంది. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా 'మేడారం యాప్' అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ వివరాలు తెలుసుకోవచ్చు. మంత్రులు దనసరి అనసూయ (సీతక్క), పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర స్వయంగా జాతర ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 42 వేల మంది ప్రభుత్వ సిబ్బంది విధుల్లో ఉన్నారు. ప్రభుత్వం చేసిన ఏర్పాట్ల పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### రాత్రివేళ మేడారం అద్భుతం

భక్తుల రద్దీతో, విద్యుత్ దీపాల వెలుగులతో రాత్రివేళ మేడారం అద్భుతంగా మెరిసిపోతోంది. చిన్న చిన్న వాగుల ఒడ్డున, చెట్ల కింద వేలాది మంది భక్తులు వంటలు చేసుకుంటూ, దీపాల వెలుగులో కుటుంబ సభ్యులతో సేదతీరుతూ ఈ అనుభూతిని మదిలో నిలుపుకుంటున్నారు. కులమతాలకు అతీతంగా బంధుమిత్రులతో కలిసి ఒకే చోట భోజనం చేయడం ఇక్కడి ప్రత్యేకత. చాలామంది భక్తులు తమ ఇళ్ల నుంచి బియ్యం, పప్పులు తెచ్చుకుని చెట్ల కింద 'వనభోజనాలు' చేస్తారు. ఇది ఒక గొప్ప పర్యాటక అనుభవాన్ని కూడా ఇస్తోంది. మేడారం అంటే కేవలం మొక్కులు తీర్చుకోవడం మాత్రమే కాదు... అది తెలంగాణ గిరిజన అస్తిత్వానికి, ధైర్యానికి ప్రతీక. ఆధునిక ప్రపంచంలో మనిషికి, ప్రకృతికి ఉన్న విడదీయరాని బంధాన్ని ఈ మహా జాతర మరోసారి గుర్తు చేస్తోంది.

# పత్రికల్లో మేటి 'అక్షర దర్బార్'

## లడే శివ, వరికేల కిషన్ రావు

అక్షరదర్బార్, హనుమకొండ: పత్రికలలో 'అక్షర దర్బార్' మేటి పత్రికగా నిలుస్తోందని హనుమకొండ జిల్లాకు చెందిన ప్రముఖ విద్యావేత్త, బీజేపీ జిల్లా నాయకులు లడే శివ పేర్కొన్నారు. గురువారం హనుమకొండలోని తన విద్యాసంస్థలో 'అక్షర దర్బార్' క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అలాగే పరకాల పట్టణంలో రైతు రక్షణ సమితి వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికేల కిషన్ రావు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్షర దర్బార్ పత్రిక నిత్యం ప్రజా సమస్యలపై కథనాలు ప్రచురిస్తూ ప్రజల పక్షాన నిలబడుతోందని కొనియాడారు. సమాజానికి ఉపయోగపడే మంచి వార్త కథనాలు అందిస్తున్న పత్రిక యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





# రూ.2,500 కోట్లతో టెంపుల్ సర్క్యూట్

- ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా మేడారం అభివృద్ధి
- శాశ్వత పనులకు 70 ఎకరాల భూసేకరణ
- ఇప్పటికే 29 ఎకరాల సేకరణ పూర్తి
- మిగిలిన 41 ఎకరాల ప్రక్రియ పూర్తి చేస్తాం
- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి




అక్షరదర్బార్, మేడారం : మేడారంను ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కింద అభివృద్ధి చేసేలా శాశ్వత కట్టడాలు చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మేడారం జాతర లోని మీడియా సెంటర్ వద్ద మంత్రి దనసరి అనసూయ సీతక్కతో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు. వన దేవతలను ఇప్పటివరకు సుమారు 80 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని మంత్రి పొంగులేటి వెల్లడించారు. సమ్మక్క గద్దెపైకి వచ్చే సమయానికి ఈ సంఖ్య కోటి దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారని చెప్పారు. జాతర శాశ్వత అభివృద్ధి కోసం ప్రభుత్వం 70 ఎకరాల భూమిని సేకరిస్తోందని మంత్రి వివరించారు. ఇప్పటికే 29 ఎకరాల సేకరణ పూర్తయిందని, మిగిలిన 41 ఎకరాల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఈ స్థలంలో శాశ్వత ప్రాతిపదికన కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించనున్నట్లు వెల్లడించారు. భక్తులకు మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి లోటు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. దక్షిణ భారత కుంభమేళాగా గుర్తింపు పొందిన మేడారం ప్రాధాన్యతను పెంచేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని పొంగులేటి ప్రకటించారు. బాసర నుంచి భద్రాచలం వరకు రూ.2,500 కోట్లతో టెంపుల్ సర్క్యూట్ నిర్మిస్తామని చెప్పారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆలయాల అభివృద్ధిలో మేడారాన్ని భాగం చేస్తామన్నారు. జంపన్న వాగులో ఏడాది పొడవునా నీరు ఉండేలా రామప్ప–లక్నవరం నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించే ప్రాజెక్టును చేపడుతున్నట్లు వివరించారు. మేడారం ప్రాంత అభివృద్ధికి సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని మంత్రి వెల్లడించారు. అంతర్గత రోడ్లు, ఎకో పార్కులు, పర్యాటక సౌకర్యాలను ఈ ప్లాన్ ద్వారా విస్తరిస్తామని చెప్పారు. ఫోర్ లేన్ రోడ్ల వల్ల భక్తుల రాకపోకలు సులభమయ్యాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా జాతర ప్రాంగణంలో పెద్ద ఎత్తున చెట్లు పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం తల్లుల వనప్రవేశం వరకు భక్తులు ఓపికతో దర్శనాలు చేసుకోవాలని మంత్రులు కోరారు.



## కాంగ్రెస్‌లోకి చేరికలు

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణ 9వ వార్డుకు చెందిన బిఆర్ఎస్ నాయకులు గురువారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు బాసాని దయాకర్‌తో పాటు పలువురు నాయకులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఆకర్షణతో చేరికలు పెరుగుతున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ, పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొజ్జం రమేష్, 9వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కందకట్ల నరహరి, వార్డు అధ్యక్షుడు దార్న వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు



## సింగరేణికి బీకన్ ఆఫ్ హోప్ అవార్డు

అక్షర దర్బార్, భూపాలపల్లి ప్రతినిధి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యధికంగా సీఎస్ఆర్ పనులు చేపట్టినందుకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు బీకన్ ఆఫ్ హోప్ అవార్డు లభించింది. భద్రాచలం ట్రైబల్ భవన్‌లో జరిగిన సీఎస్ఆర్ సమిట్‌లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ చేతుల మీదుగా సింగరేణి జనరల్ మేనేజర్ జి. వెంకట కిరణ్ కుమార్‌కు అవార్డు అందజేశారు. గత ఐదేళ్లలో రూ.15 కోట్లకు పైగా సీఎస్ఆర్ నిధులతో గ్రామాభివృద్ధి పనులు చేపట్టినందుకు ఈ గుర్తింపు లభించినట్లు తెలిపారు.

## రాధా టీఎంటీ స్టీల్ ఆధ్వర్యంలో తాగునీరు పంపిణీ

అక్షర దర్బార్, ములుగు ప్రతినిధి : మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం రాధా టీఎంటీ స్టీల్ సంస్థ గత మూడు జాతరల నుంచి నిరంతరంగా సేవా కార్యక్రమాలు చేస్తోంది. జాతరకు వచ్చిన భక్తులకు వారి సిబ్బందితో ఉచిత మినరల్ వాటర్ పంపిణీ చేస్తూ భక్తుల దాహం తీరుస్తున్నారు. తాత్కాలిక బస్ స్టేషన్ రహదారిలో భక్తులకు తాగునీరు పంపిణీ చేశారు.

## అగ్ని ప్రమాద ఘటనపై డీడీఎంఎస్ విచారణ

అక్షర దర్బార్, భూపాలపల్లి ప్రతినిధి : భూపాలపల్లి ఏరియా కేటీకే 5వ గని ల్యాంప్ రూమ్ లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై గురువారము డిడిఎంఎస్ (ఎలక్ట్రికల్) విచారణ జరిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి సంబంధిత సింగరేణి ఉద్యోగులను, అధికారులను విచారించినట్లు సమాచారం బుధవారం కేటీకే 5వ గని ల్యాంప్ రూమ్ లో షార్ట్ సర్క్యూట్ జరిగి నిప్పురవ్వలు ఎగిరిపడి క్యాప్ ల్యాంప్ లు దగ్ధమైన విషయం తెలిసిందే.

# మున్సిపాలిటీల్లో నామినేషన్ల కోలాహలం

### నామినేషన్ స్వీకరణను పరిశీలించిన కలెక్టర్ స్నేహ శబరిష్

అక్షర దర్బార్, పరకాల: హన్మకొండ జిల్లా పరకాల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ వార్డు ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలలో గురువారం నామినేషన్ స్వీకరణ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరిష్ పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ సక్రమంగా జరుగుతోందా, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినారా అనే అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలపై కూడా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

### పరకాల ఎన్నికల పరిశీలకుడిగా శివకుమార్ నాయుడు

పరకాల పురపాలక ఎన్నికల సాధారణ పరిశీలకుడిగా సీనియర్ ఐఏఎస్ అధికారి శివకుమార్ నాయుడును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌కు వచ్చిన ఆయనను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మొక్కను అందించి స్వాగతించారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో పరకాల పురపాలక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఇరువురు చర్చించారు.

### రెండో రోజు కొనసాగుతున్న నామినేషన్లు..

పరకాల మున్సిపాలిటీ ఎన్నికలలో బుధవారం ఐదుగురు నామినేషన్ దాఖలు చేసుకోగా రెండవ రోజు గురువారం 39 మంది నామినేషన్లు దాఖలు చేసుకున్నారు. శుక్రవారం బి ఆర్ ఎస్, బిజెపి,కాంగ్రెస్ పార్టీల నుండి చైర్మన్ అభ్యర్థితో పాటు కౌన్సిలర్లు కూడా నామినేషన్లు వెయ్యనున్నారు.

### 'కేసముద్రం'లో..




నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

అక్షర దర్బార్, కేసముద్రం : మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి వివిధ పార్టీల అభ్యర్థులు మొదటి రోజు నామినేషన్‌లు వేయడానికి ఉత్సాహం చూపలేదు. ఈ నేపథ్యంలోనే రెండవ రోజు (గురువారం) నామినేషన్‌ల పర్వం భారీగా కొనసాగింది. కాంగ్రెస్ అభ్యర్థుల నుంచి భారీగా నామినేషన్‌లు రాగా, బిఆర్ఎస్ నుంచి, బిజెపి, ఇండిపెండెంట్ ల నుంచి నామమాత్రంగా నామినేషన్‌లు దాఖలు కావడంతో మొత్తంగా కేసముద్రం మున్సిపాలిటీలో 58 నామినేషన్‌లు దాఖలయ్యాయి.మంగళవారం ఎన్నికల కమిషనర్ మున్సిపల్ షెడ్యూల్ విడుదల చేయడంతో పాటు ఈనెల 30వ తేదీ వరకు నామినేషన్‌లకు చివరిగడువుగా పేర్కొన్నారు. దీంతో మొదటిరోజు వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్‌లను దాఖలు చేయడానికి ఆసక్తి చూపలేదు. ఇంకా ఒక రోజే నామినేషన్‌లకు గడువు ఉండడంతో రేపు నామినేషన్‌లు భారీగా దాఖలవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.



నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు



పరకాల మున్సిపల్ ఎన్నికల పరిశీలకుడిగా శివకుమార్

### భూపాలపల్లిలో

అక్షర దర్బార్, భూపాలపల్లి ప్రతినిధి : మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ పర్వం కొనసాగుతోంది. రెండో రోజు గురువారం భూపాలపల్లిలో 20 నామినేషన్లు వచ్చాయి. మొదటి రోజు బుధవారం 4 నామినేషన్లు దాఖలైన విషయము విధితమే, మొత్తం 24 నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

అక్షర దర్బార్ Voice of the people

# ఆ మున్సిపాలిటీలపై గురి

- మున్సిపల్ ఎన్నికలపై గులాబీ దళం ఫోకస్
- స్టేషన్ ఘన్‌పూర్ బల్దియాపై ప్రత్యేక నజర్
- ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యే కడియంపై రివేంజ్‌కు వ్యూహరచనలు
- రంగంలోకి ఎమ్మెల్సీ పోచంపల్లి.. గులాబీ శ్రేణులకు దిశానిర్దేశం
- తొర్రూర్, వర్ధన్నపేటలో అధికార పార్టీలో ముసలం
- బీఆర్ఎస్ కు కలిసి రానున్న వర్గపోరు
- పేట`లో `ఆరూరి చేరికతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం
- జనగామలో పల్లా, మరిపెడలో రెడ్యా గెలుపుపై ధీమా
- ఇతర బల్దియాల్లోనూ అధికార పార్టీకి టగ్ ఆఫ్ వారే!




అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల సెగ మొదలైంది. ఎన్నికల్లో పోటీ చేసి ఎక్కువ స్థానాలు గెలుచుకునేందుకు అన్ని ప్రధాన పార్టీలు ఉవ్విళ్లూరుతున్నాయి. దీనిలో భాగంగానే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, పరకాల, డోర్నకల్, మరిపెడ, భూపాలపల్లి, ములుగు, కేసముద్రం, వర్ధన్నపేట, తొర్రూర్, స్టేషన్ ఘన్‌పూర్, జనగామ, నర్సంపేట మున్సిపాలిటీల్లోనూ ఎన్నికల వేడి రాజుకున్నది. ఈ 12 మున్సిపాలిటీల్లో అధికార పార్టీ కాంగ్రెస్ కంటే ఎక్కువ స్థానాలను కైవసం చేసుకునేందుకు బీఆర్ఎస్ వ్యూహ రచనలు చేస్తుంది. ముఖ్యంగా స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట, తొర్రూర్, మరిపెడ, జనగామ మున్సిపాలిటీలపై గులాబీ దళం ఎక్కువ నజర్ పెట్టింది. ఆ ఐదు స్థానాలను ఎట్టిపరిస్థితుల్లోనూ దక్కించుకోవాలని ప్రణాళికలు రూపొందిస్తున్నది. అన్నిటికంటే స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీపై గులాబీ శ్రేణులు మరింత పట్టింపుగా ఉన్నాయి. ఈ ఐదు మున్సిపాలిటీలు కాకుండా మిగతా 7 మున్సిపాలిటీల్లో 6 మున్సిపాలిటీల్లోనూ రెండు ప్రధాన పార్టీల మధ్య టాగ్ ఆఫ్ వారే నడుస్తుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**- టార్గెట్... కడియం**

అన్ని మున్సిపాలిటీల కంటే గులాబీ శ్రేణులు స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీపై ఎక్కువ దృష్టిపెట్టాయి. కొత్తగా ఏర్పడిన ఈ మున్సిపాలిటీలో తొలిసారి గులాబీ జెండా ఎగురవేయాలని ఉత్సాహంగా పనిచేస్తున్నాయి. ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఎన్నికల్లో గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ పంచన చేరడంపై ఆ పార్టీ గుర్రుగా ఉంది. దీంతో కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్‌కు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే కడియంపై ఆధిపత్యాన్ని సాధంచేందుకు బీఆర్ఎస్ అధిష్ఠానం మున్సిపాలిటీ ఎన్నికల ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డిని నియమించింది. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంపై పట్టు ఉన్న ఎమ్మెల్సీ ఎలాగైనా చైర్మన్ పదవి దక్కించుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఎమ్మెల్సీకి తోడు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాడికొండ రాజయ్య కూడా పనిచేస్తున్నారు. కడియం బీఆర్ఎస్‌ను మోసం చేసి, కాంగ్రెస్‌లో చేరారని భావిస్తూ మున్సిపల్ ఎన్నికల్లో పైచేయి సాధించేందుకు సిద్ధమవుతున్నారు.

**- వర్ధన్నపేటపై..**

వర్ధన్నపేట మున్సిపాలిటీపై గులాబీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాయి. స్థానిక ఎమ్మెల్యే నాగరాజు, లోకల్ కాంగ్రెస్ లీడర్లకు మధ్య గ్యాప్ బీఆర్ఎస్ కు కలసి వచ్చే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగే బీజేపీని వీడి తాజాగా మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ గులాబీ గూటికి చేరడం కూడా ఆ పార్టీకి ప్లస్ అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇక్కడ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జిగా రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఇక ఆరూరి రమేశ్, నాగుర్ల వెంకటేశ్వరరావు కలిసి దూసుకెళితే ఇక్కడ గులాబీ పార్టీ పైచేయి పెద్ద కష్టమేమీ కాదనే ప్రచారం జరుగుతుంది. ఇక్కడ 12 వార్డులు ఉండగా, 7 వార్డులు సాధించి చైర్‌పర్సన్ పీఠం దక్కించుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులు ధీమాగా ఉన్నాయి.

**- తొర్రూర్ లో అధికార పార్టీకి..**

తొర్రూర్ మున్సిపాలిటీలో ఆధిపత్యం సాధించేందుకు గులాబీ శ్రేణులు ఉవ్విళ్లూరుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ రాజకీయాలు ఆ పార్టీకి చాలా ప్లస్ అయ్యాయి. పాలకుర్తి నియోజకవర్గంలో భాగమైన ఈమున్సిపాలిటీ కాంగ్రెస్‌కు వ్యతిరేక పవనాలే వీస్తున్నాయని ప్రచారంలో ఉంది. ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఆమె అత్త ఝాన్సీరెడ్డికి మధ్య గ్యాప్ ఉందని, వారిద్దరి మధ్య సమీకరణాలు చెడాయని సొంత పార్టీ శ్రేణులే చెవులు కొరుక్కుంటున్నాయి. ఈ పరిణామాలన్నింటినీ క్యాష్ చేసుకునేందుకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు గులాబీ పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు.

**- మరిపెడ, జనగామలో గులాబీ జోష్**

మరిపెడ, జనగామ మున్సిపాలిటీల్లోనూ గులాబీ పార్టీకే అనుకూలమైన పవనాలు వీస్తున్నాయని తాజా పరిణామాలను చూస్తే తెలిసిపోతుంది. మరిపెడలో బీఆర్ఎస్ సీనియర్ నేత రెడ్యానాయక్ అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. మరిపెడ మున్సిపల్ పీఠాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని ప్రణాళికలు రచిస్తున్నారు. దీనిలో భాగంగానే ఆయన మున్సిపాలిటీలో కాలికి బలపం కట్టుకుని తిరుగుతున్నారు. అలాగే జనగామలో గెలుపు కోసం స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గులాబీ శ్రేణలను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి, ఎమ్మెల్యే మధ్య వార్ నడుస్తున్నది. ప్రొటోకాల్ విషయంలో రెండు వర్గాలు తరచూ గొడవ పడుతున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో ఎలాగైనా చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని పార్టీ శ్రేణులను పల్లా ముందుకు నడిపిస్తున్నారు.

**- మిగతా చోట్ల కూడా టగ్ ఆఫ్ వారే..**

పైన చర్చించిన ఐదు మున్సిపాలిటీల్లో గులాబీ శ్రేణులు గెలుస్తామనే ధీమా వ్యక్తం చేస్తుండగా, మిగతా చోట్ల కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు మధ్య టగ్ ఆఫ్ వారే నడువనుంది. ఇరు పార్టీలు నువ్వా.. నేనా? అనేంత టైట్గా ఫైట్ నడువనున్నది. నాలుగైదు మున్సిపాలిటీల్లో మాత్రం అధికార పార్టీకే అనుకూలమైన వాతావరణం ఉందని, ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఏదేమైనా.. ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో అధికారపార్టీకి, బీఆర్ఎస్ కు మధ్య గట్టి పోటీ ఉండనుందనేది సుస్పష్టం.

## కేసీఆర్‌కు సిట్ నోటీసులు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో రేపు మధ్యాహ్నం విచారణకు హాజరు
- తనకు నచ్చిన చోటును ఎంపిక చేసుకునే వెసులుబాటు

అక్షరదర్బార్, హైదరాబాద్ : రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసు మరో మలుపు తీసుకున్నది. ఈ కేసులో తాజాగా విచారణకు హాజరుకావాలని బీఆర్ ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. సిట్ అధికారులు స్వయంగా హైదరాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి అందజేశారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని నోటీసులో కోరారు. కేసీఆర్ వయస్సు రీత్యా పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదని, విచారణకు హాజరయ్యేందుకు హైదరాబాద్ నగర పరిధిలోని ఏదైనా ప్రాంతం ఎంచుకోవచ్చని పేర్కొన్నారు. అయితే.. సిట్ ఎక్కడ కేసీఆర్‌ను విచారిస్తుందనే అంశంపై ఇప్పటికి స్పష్టత లేదు.

## రేపు విచారణకు హాజరు కాలేను

**- బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్**

అక్షరదర్బార్, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ తనకు పంపిన నోటీసులపై బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వివరణ ఇచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు విచారణకు హాజరుకావాలని సిట్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆయన పోలీసులకు ప్రత్యుత్తరం పంపారు. అయితే రేపు విచారణకు హాజరు కాలేనని కేసీఆర్ పోలీసులకు తెలిపారు. తనను ఎర్రవల్లిలోనే విచారణ చేయాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా నామినేషన్ల దాఖలుకు శుక్రవారం చివరి తేదీ కావడం వల్ల తాను విచారణకు రాలేనని స్పష్టం చేశారు. విచారణకు మరో తేదీ ఫిక్స్ చేయాలని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతగా విచారణకు సహకరిస్తానని కేసీఆర్ తెలిపారు. భవిష్యత్తులో నోటీసులన్నీ ఎర్రవల్లికే పంపాలని ఆయన తెలిపారు.

## ప్రజల దృష్టిని మళ్లించడానికే కేసీఆర్‌కు నోటీసులు

- ఆయనపై ఆరోపణలంటే సూర్యుడిపై ఉమ్మి వేయడమే : మాజీ మంత్రి హరీశ్ రావు

అక్షరదర్బార్, హైదరాబాద్: రాష్ట్రంలో పెరుగుతున్న ప్రజావ్యతిరేకత, సింగరేణి కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రికి నోటీసులు అందడంపై గురువారం ఆయన తీవ్రంగా స్పందించారు. కేసీఆర్‌పై బురద చల్లాలని చూడటం సూర్యుడిపై ఉమ్మి వేయడమేనని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని మండిపడ్డారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో రాజకీయ లబ్ది పొందేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా తాము భయపడేది లేదని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలు, ఇతర హామీలను అమలు చేసే వరకు ప్రభుత్వం వెంట పడుతూనే ఉంటామని హెచ్చరించారు. తెలంగాణ సమాజం మొత్తం కేసీఆర్ వెంటే ఉందని వ్యాఖ్యానించారు.

# చరిత్రలో నిలిచిపోయే రోజు

- బేగంపేట సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కేంద్రమంత్రికి మామునూరు ఎయిర్ పోర్టు కోసం భూమి అప్పగింత



అక్షరదర్బార్, బేగంపేట: ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే మామునూరు ఎయిర్‌పోర్ట్ కు అవసరమైన భూమిని సేకరించి ఈరోజు కేంద్ర విమానయాన శాఖకు అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. వరంగల్ జిల్లాలోని మామునూరు ఎయిర్‌పోర్ట్ కు అవసరమైన 300 ఎకరాల భూమిని కేంద్ర వైమానిక శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు అని డిప్యూటీ సీఎం అన్నారు. గురువారం బేగంపేట విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. మామునూరు తరహాలోనే ఆదిలాబాద్, కొత్తగూడెం పట్టణాల్లో ఏర్పాటు చేయదలచిన ఎయిర్‌పోర్ట్ ల నిర్మాణం పనిని వేగవంతం చేయాలని కేంద్రమంత్రికి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. తెలుగు గడ్డపై పుట్టిన వ్యక్తి కేంద్రంలో వైమానిక శాఖ మంత్రిగా ఉండడం అభినందనీయమని వారు తెలంగాణ రాష్ట్ర అవసరాలను గుర్తిస్తూ సహకారం అందించాలని డిప్యూటీ సీఎం కోరారు.
2007లోనే ఎయిర్‌పోర్ట్ అథారిటీతో మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ఒప్పందం చేసుకున్నప్పటికీ గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు పట్టించుకోకపోవడంతో వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం ఆలస్యమైందని డిప్యూటీ సీఎం తెలిపారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915